# ఆడబిడ్డలకు బతుకమ్మ కానుక సిద్ధం


భైంసా : పంపిణీకి సిద్ధంగా ఉన్న బతుకమ్మ చీరెలు

- నేడు భైంసాలో చీరెలు పంపిణీ చేయనున్న ఎమ్మెల్యే విఠల్ రెడ్డి

భైంసా, అక్టోబర్ 4 : ప్రతి యేటా బతుకమ్మ పండుగను పురస్కరించుకొని సర్కారు ఆడబిడ్డలకు కానుకగా బతుకమ్మ చీరెను అందిస్తున్నది. ప్రభుత్వం రంజాన్ పండుగకు ముస్లింలకు, కిస్మస్ పండుగకు క్రిష్టియన్లకు గిఫ్ట్ ప్యాక్‌లు, బతుకమ్మ పండుగకు తెలంగాణ ఆడబిడ్డలకు బతుకమ్మ చీరెలు అందజేస్తూ ప్రజల సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తున్నది. ఈ సారి పది రంగులు, 250 డిజైన్లలో నాణ్యతతో తయారు చేసిన చీరెలను గురువారం భైంసాలో ఎమ్మెల్యే విఠల్ రెడ్డి ఎంపీడీవో కార్యాలయంలో పంపిణీ చేయనున్నారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన 18 ఏళ్లు పై బడిన మహిళలందరికీ రేషన్ దుకాణాల ద్వారా ఉచితంగా చీరెలను అందించనున్నారు. తెలంగాణలో దసరా పండుగకు ప్రత్యేక స్థానం ఉంది. దీనికి ముందు నిర్వహించే సద్దుల బతుకమ్మ పండుగ అంటే మహిళలకు ఎంతో ప్రత్యేకం. ఊరు.. వాడా.. పల్లె పట్టణం తేడా లేకుండా మహిళలు, యువతులు ఉత్సాహంగా బతుకమ్మ వేడుకల్లో పాల్గొంటారు. ప్రభుత్వం ఏటా బతుకమ్మ పండుగను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నది.

**ఈ సారి పట్టు చీరెల రూపంలో..**

బతుకమ్మ చీరెల నాణ్యత పంపిణీపై మహిళల అభిప్రాయాలను దృష్టిలో పెట్టుకొని సర్కారు ఈ సారి మరింత ఆకర్షణీయంగా రంగు రంగుల డిజైన్లతో చీరెలను తయారు చేయించింది. ఎలాంటి లోపాలు లేకుండా మరింత మన్నికతో కూడిన చీరెలు తయారు చేయించారు. వీటి ప్యాకింగ్ కూడా సుందరంగా రూపొందించారు. గురువారం భైంసా మండలం, పట్టణానికి సంబంధించిన చీరెలను ఎంపీడీవో ఎమ్మెల్యే విఠల్ రెడ్డి పంపిణీ చేయనున్నారు. మొత్తం భైంసాకు 15 వేల చీరలు అవసరముండగా 3 వేల చీరెలు వచ్చాయి. తానూర్, కుంటాల మండలం, భైంసా మండలానికి కలిపి 34 వేల చీరెలు వచ్చాయి.

**ముథోల్‌లో..**

ముథోల్, అక్టోబర్ 4 : మండలంలోని అన్ని గ్రామపంచాయతీలకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న బతుకమ్మ చీరెలను అధికారులు ఆయా గ్రామాల కార్యదర్శులు, ఐకేపీ మహిళలకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి సంవత్సరం మాదిరిగా ఈ సంవత్సరం సైతం చీరెలను పంపిణీ చేస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికే అన్ని పంచాయతీలకు చీరెలు పంపిణీ చేసినట్లు వివరించారు. త్వరలోనే పంపిణీ చేస్తారని తెలిపారు.


భైంసా : బతుకమ్మ చీరెలు


ముథోల్ : సిబ్బందికి చీరెలను అందిస్తున్న అధికారులు


గొర్రెలను పంపిణీ చేస్తున్న ప్రజా ప్రతినిధులు

# లబ్ధిదారులకు గొర్రెల పంపిణీ

కుంటాల, అక్టోబర్ 4 : రెండో విడుతలో భాగంగా అర్హులైన 14మంది లబ్ధిదారులకు 238 గొర్రెలను బుధవారం గ్రామ సర్పంచ్ దొనికెన సమతా వెంకటేశ్ పంపిణీ చేశారు. ప్రభుత్వం గొల్ల కుర్మల సంక్షేమానికి సర్కారు కృషి చేస్తున్నదని పేర్కొన్నారు. మిగిలిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే విఠల్ రెడ్డి సహకారంతో త్వరలో పంపిణీ చేస్తామని చెప్పారు. వార్డు సభ్యులు సబ్బిడి పద్మ గజేందర్, బోనగిరి రమేశ్, నాయకులు సబ్బిడి రాకేశ్, శ్రీరాంవార్ సంతోష్ పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు భూమి పూజ


కుల సంఘం భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న గ్రామ పెద్దలు

భైంసాటౌన్, అక్టోబర్ 4 : మండలంలోని లింగా గ్రామంలో బుధవారం గ్రామ సర్పంచ్ దుప్పె గణేశ్, గ్రామ పెద్దలు పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఈజీఎస్ పథకంలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 6 లక్షలు, కుల సంఘాలు, డ్రైనేజీ నిర్మాణానికి ఎస్‌డీఎఫ్ నిధులు రూ. 10 లక్షలు మంజూరైనట్లు తెలిపారు.


అమ్మవారి క్షేత్రంలో శారద మఠాధీశ్వరులు

## అమ్మవారిని దర్శించుకున్న శివగంగా శారద మఠాదీశ్వరులు

బాసర, అక్టోబరు 4 : బాసర సరస్వతీ అమ్మవారిని బుధవారం శృంగేరి శివగంగా శారద మఠాదీశ్వరులు పురుషోత్తమ భారతి మహాస్వామి వారు దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు దేవస్థాన ఆలయ మర్యాదలతో ఘనంగా పూర్ణ కుంభ స్వాగతం పలికారు. సందర్భంగా ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అక్షరాభ్యాస మండపలంలో స్వామి వారికి ధూళి పాదపూజ నిర్వహించారు.

## భైంసా అధ్యాపకుడికి డాక్టరేట్

భైంసా, అక్టోబర్ 4 : భైంసా గోపాల్‌రావు పటేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్రం బోధిస్తున్న అధ్యాపకుడు కోసరి సంతోష్ కుమార్‌కు డాక్టరేట్ వరించింది. ఈ మేరకు దీపమాల పర్యవేక్షణలో తెలంగాణ అటవీ ప్రాంతాల్లో కీటకాలు, పురుగుల వైవిధ్యం జీవావరణ శాస్త్రం అనే అంశంపై లక్నోలోని గ్లోకల్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ పూర్తి చేయగా వర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్, అధ్యాపకులు ఆయన్ను అభినందించారు.

# నూతన జీపీలకు సొంత భవనాలు

- రూ. 20 లక్షలతో ఆధునిక హంగులు
- వేగంగా సాగుతున్న పనులు

ముథోల్, అక్టోబర్ 2 : పల్లెల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగానే మండలంలోని నూతన గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసింది. అందుకు అనుగుణంగా ప్రతీ గ్రామపంచాయతీకి నూతన జీపీ భవనాలను మంజూరు చేసింది. అందుకు గానూ ఒక్కో గ్రామపంచాయతీ భవన నిర్మాణం కోసం రూ. 20 లక్షలు కేటాయించింది. సర్కారు ఆధునిక హంగులతో భవనాలను నిర్మిస్తున్నది. ముథోల్ మండలంలో 12 నూతన గ్రామ పంచాయతీ భవనాలు మంజూరయ్యాయి. విట్టోలి, విట్టోలి తండా, బ్రాహ్మణ్‌గాం, చింత కుంటతో పాటు తదితర గ్రామాలకు మంజూరు చేశారు. దీంతో పాటు గ్రామాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నది. నాలుగు గ్రామపంచాయతీ భవనాల పనులు శరవేగంగా సాగుతున్నాయి. మిగితా భవనాలను సైతం త్వరలో ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. అన్ని హంగులతో జీపీ భవన నిర్మాణాలు చేపడుతుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


విట్టోలిలో నిర్మిస్తున్న నూతన గ్రామపంచాయతీ భవనం

**ఆధునిక హంగులతో నిర్మాణం**

ప్రభుత్వం పంచాయతీలకు కొత్త భవనాలను మంజూరు చేసింది. పరిపాలన సౌలభ్యం కోసం భవనాలను అన్ని హంగులతో నిర్మిస్తున్నాం. ప్రజలకు అందుబాటులో ఉండేలా పంచాయతీ భవన నిర్మాణాలు కొనసాగుతున్నాయి. జీపీలో ప్రజలకు కనీస సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. నిధులు మంజూరైన గ్రామాల్లో త్వరగా పనులుచేపట్టే విధంగా చూస్తాం.


- సురేశ్ బాబు, ఎంపీడీవో

**సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం..**

మా గ్రామానికి నూతన గ్రామపంచాయతీ మంజూరు చేశారు. మా గ్రామంలో అన్ని విధాలుగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఎమ్మెల్యే విఠల్ రెడ్డి సహకారంతో నూతన భవనాన్ని నిర్మించుకుంటున్నాం. మా గ్రామ ప్రజలంతా సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం. బీఆర్ఎస్ హయాంలో పల్లెలు ప్రగతి పథంలో ముందుకెళ్తున్నాయి.


- రాంరెడ్డి, సర్పంచ్(బ్రాహ్మణ్‌గాం)

## నేడు ఎమ్మెల్యే రాక

తానూర్, అక్టోబర్ 4 : మండల కేంద్రంతో పాటు కోలూర్, జౌలా(బీ) సింగన్‌గావ్ గ్రామాలకు గురువారం ఉదయం 11 గంటలకు ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి వస్తున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కానుగంటి పోతారెడ్డి తెలిపారు. కోలూర్ గ్రామంలో హెల్త్ సబ్ సెంటర్, షాదీఖానా, ఎస్సీ, బీసీ కమిటీ హాల్‌కు భూమి పూజ, జౌలా(బీ)గ్రామంలో హెల్త్ సబ్ సెంటర్‌కు భూమిపూజ, సింగన్‌గావ్‌లో రూ. 10 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తారని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

**ముథోల్‌లో..**

ముథోల్, అక్టోబర్ 4 : ముథోల్‌కు ఎమ్మెల్యే విఠల్ రెడ్డి గురువారం ఉదయం 11 గంటలకు రానున్నట్లు మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు అఫ్రోజ్ ఖాన్ తెలిపారు. బతుకమ్మ చీరల పంపి ణీ, స్పోర్ట్స్ కిట్ల పంపిణీ ఎమ్మెల్యే చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎంపీపీ, జడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

## 13 నుంచి ఏడో జోనల్ గేమ్స్

ఇచ్చోడ, అక్టోబర్ 4 : మండల కేంద్రంలో గిరిజన గురుకుల కళాశాల, బాలికల పాఠశాలలో ఈ నెల 13, 14,15వ తేదీల్లో 7వ జోనల్ గేమ్స్‌ను నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జీ లక్ష్మీ కాంతారావ్ తెలిపారు. గురుకులం సొసైటీ స్పోర్ట్స్ ఆఫీసర్ రవికుమార్, ఈఎంఆర్ఎస్ స్పోర్ట్స్ ఆఫీసర్ వీర్యానాయక్, ఆర్‌సీవో గంగాధర్ కలిసి ఏర్పాట్లను పరిశీలించి తగిన సూచనలు ఇచ్చారు.